# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే రెండేళ్ళలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు.
- రాష్ట్రంలో ఈ రోజు నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభమైంది.
- ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకొనేందుకు ఈ నెల 7,8 తేదీలలో మరో అవకాశాన్ని కల్పిస్తున్నట్లుగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు.
- దేశంలో మూడవ దశలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ప్రచారం కొద్ది సేపటి క్రితం ముగిసింది.
- ద్రోణి ప్రభావంతో ఈనెల ఏడో తేదీన రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=============================

దేశంలో మూడవ దశలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ప్రచారం కొద్ది సేపటి క్రితం ముగిసింది. ఈ నెల 7 న జరిగే మూడవ దశ ఎన్నికలకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లుగా ఈసీ వర్గాలు తెలిపాయి. మూడవ దశలో 10 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతం దాద్రా మరియు నగర్ హవేలీ, డామన్ డయ్యూలలో విస్తరించి ఉన్న 93 నియోజకవర్గాలలో ఈ నెల 7 న పోలింగ్ జరుగుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

=============================

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిని గెలిపిస్తే రానున్న రెండు సంవత్సరాల్లో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల తరఫున ఈ రోజు నిర్వహించిన ప్రచార బహిరంగ సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అమరావతిని

రాజధానిగా నిలబెట్టే పనులు వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తామని అమిత్ షా భరోసా ఇచ్చారు. అవినీతి లేని ప్రభుత్వాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అభివృద్ధిలో ప్రపంచంలో భారత దేశం మూడవ స్థానానికి చేరుకోవడం వెనక పదేళ్ళ ఎన్డీఏ ప్రభుత్వం చేసిన కృషి ఎంతో ఉందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ రోజు ఆయన వైఎస్సార్ జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ, ఎన్నికల తరువాత రాష్ట్రంలో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు ఏర్పాటు అవుతాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఈ రోజు నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభమైంది. ఓటు వేసేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల వద్ద అధికారులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. పోస్టల్ ఓటు విషయంలో ఏమైనా సందేహాలు ఉన్నవారు, కలెక్టరేట్ లోని హెల్ప్ డెస్క్ 1950 నెంబర్ ను సంప్రదించాలని అధికారులు సూచించారు. ఇదిలా ఉండగా పల్నాడు జిల్లాపెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ను జిల్లాఎన్నికల అధికారి శివశంకర్ పరిశీలించారు. అలాగే, మాచర్లలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారి ఏ. శ్యాం ప్రసాద్ పరిశీలించారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 11,239మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. తిరుపతి పార్లమెంటు పరిధిలో 22వేల మంది ఉద్యోగస్తులందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకుంటు న్నారని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకొనేందుకు ఈ నెల 7,8 తేదీలలో మరో అవకాశాన్ని కల్పిస్తున్నట్లుగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. విజయనగరం జిల్లాలో ఆయన ఈ రోజు పర్యటించారు. జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను సందర్శించారు. ఓటింగ్‌కు చేసిన ఏర్పాట్లు, ఓటింగ్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్‌లు, క్యూలైన్లు, పోలింగ్ బూత్‌లు పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సి-విజిల్ ద్వారా ఇప్పటివరకు సుమారు 16 వేల ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దక్షిణ ఛత్తీస్ ఘడ్ నుంచి రాయలసీమ వరకు తెలంగాణ మీదుగా సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని, దీని ప్రభావంతో ఈనెల ఏడో తేదీన రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి లోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, పల్నాడు, చిత్తూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో ప్రస్తుతం పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 నుంచి 47 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. దీనికి తోడు రాయల సీమ జిల్లాలలో తీవ్ర వడగాడ్పులు వీస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. దీనికి సంబంధించి ఈ నెల 20న సాయంత్రం అంకురార్పణ జరుగనుంది. 21వ తేదీ ఉదయం 10.45 నుండి 11.30 గంటల మధ్య కర్కాటక లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు టిటిడి తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే సామాజిక పెన్షన్లను 4 వేల రూపాయలకు పెంచుతూ ఏప్రిల్ నెల నుంచే అమలు చేస్తామని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఈ రోజు జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడుతూ, దివ్యాంగులకు పెన్షన్ల ను ఆరు వేల రూపాయలకు పెంచుతామని, అలాగే, చేనేత కార్మికులకు ఏడాదికి 24 వేల రూపాయలు ఇస్తామని తెలిపారు. దేశంలో రాబోయేది ఎన్డీయే ప్రభుత్వమేనని, మరోసారి నరేంద్ర మోదీనే ప్రధాని కాబోతున్నారని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల ప్రక్రియ పట్ల సూక్ష్మ పరిశీలకులకు పూర్తి అవగాహన ఉండాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా అన్నారు. పోల్ ప్రక్రియను విభిన్న కోణాలలో పరిశీలించాలని వారికి ఆమె సూచించారు. అలాగే, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన ఉండాలన్నారు. సూక్ష్మ పరిశీలకులు స్వతంత్రంగా, స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణలో కీలక భూమిక పోషించాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో మే నెలలో విశేష ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 11, 18, 25వ తేదీల్లో శ్రీ సీతారామ లక్ష్మణుల మూలవర్ల అభిషేకం, ఊంజల్‌సేవ, నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ప్రజల భూములను కాపాడేందుకు ల్యాండ్ టైటిలింగ్ చట్టం ఉందని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లిలో ఈ రోజు పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ చట్టంతో భూములు కోల్పోతారంటూ విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు దీనిని గమనించాలని ఆయన కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికలలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ హెచ్చరించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు చేపట్టామని తెలిపారు. భీమవరంలో ఈ రోజు పాత్రికేయులతో కలెక్టర్ మాట్లాడుతూ ఈసారి జిల్లాలో పోలింగ్ శాతం పెంచేలా కృషి చేస్తున్నామన్నారు.

==============================

సార్వత్రిక ఎన్నికల విధుల్లో వున్న ప్రిసైడింగ్ అధికారులు సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఈవీఎంల వినియోగంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున సూచించారు. విశాఖపట్నంలో ఈ రోజు జరిగిన పశ్చిమ నియోజకర్గ ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను ఆర్వో హుస్సేన్ సాహెబ్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్ల పనితీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీవీప్యాట్లు ప్రింటయ్యే తీరు ఇతర ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించారు.

==============================

==============================